భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న గోగిరెడ్డి అంజిరెడ్డి తదితరులు

చంపాపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ హనుమాన్‌నగర్‌కాలనీ రోడ్ నెం1లో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం చైతన్యపురి బ్రాంచి సీబీ 16 అధ్యక్షుడు గోగిరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా డిసిప్లేనరీ కమిటీ ఛైర్మన్ పూరి వెంకటేశం, డివిజన్ ప్రెసిడెంట్ చింతల వెంకట్‌రెడ్డి, సెక్రటరీ సుదర్శన్, ట్రెజరర్ గూడె శీనయ్య, చైతన్యపురి బ్రాంచి అధ్యక్షుడు గోగిరెడ్డి అంజిరెడ్డి, సెక్రటరీ దాసయ్య, ట్రెజరర్ వెంకటేష్ పాల్గొన్నారు.

మట్టిగణపతులను ప్రతిష్ఠించాలి: ఎమ్మెల్యే

దిల్‌సుఖ్‌నగర్ : పర్యావరణ హితం కోరే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. శ్రీ గణేష్ యువ భక్త మండలి ఆధ్వర్యంలో పీ అండ్ టీ కాలనీలో ప్రతిష్ఠిస్తున్న 39 అడుగుల మట్టిగణపతి నిర్మాణ పనుల మండపాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మట్టిగణపతి ప్రతిమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ భవానీప్రవీణ్‌కుమార్, గణేష్ యువ భక్త మండలి నిర్వాహకులు నారాయణరావు, నగేష్‌యాదవ్, రాంకుమార్, రాజు, కర్ల శ్రీనివాస్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

తారామతిపేటను మున్సిపాలిటీలో విలీనం చేయొద్దు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కోరిన గ్రామస్థులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తారామతిపేట గ్రా మాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని మాజీ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఔటర్‌ను వెలుపల ఆనుకుని ఉన్న బాచారం, తారామతిపేట గ్రామాలను ఎట్టి పరిస్థితిలో మున్సిపాలిటీలో కలపొద్దని విజ్ఞప్తి చేశారు. దీనికి ఎమ్మెల్యే రంగారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో రాజు, మధు, బాలయ్య, బాబు, రమేష్, అయిలయ్య పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం

హయత్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం నిరంతరం కృషి చేస్తోందని తుర్కయంజాల్ సహకార సంఘం, డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం శనివారం సంఘం ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మే నుంచి జూలై 31వ తేదీ వరకు సంఘం జమా, ఖర్చులను పాలకవర్గం ఆమోదం తెలిపింది. అనంతరం డీసీసీబీ ఛైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ సంఘంలో 50 మంది నూతన సభ్యులను చేర్చుకున్నట్లు తెలిపారు. 18 మంది రైతులకు సంఘం ద్వారా రూ. 1కోటి 39లక్షల రుణాలను మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం వైస్ ఛైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మమ్మ, సంజీవరెడ్డి, నర్సింగరావు, లక్ష్మారెడ్డి, స్వప్న, యాదగిరి, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సెక్రెటరీ రాందాస్ పాల్గొన్నారు.

చింతల్‌బస్తీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సైదాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పేరుకుపోయిన ప్రజాసమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శనివారం చింతల్‌బస్తీలో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా మాస్టర్ ప్లాన్ రూపొందించానని వివరించారు. ముందుగా నూతన రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నాయకులు రఘుపతి, కృష్ణ, మహేష్, సోమ్లా, రేణుక, భారతీ, వెంకటేష్ పాల్గొన్నారు.

బాలాపూర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన

సరూర్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని అన్ని డివిజన్లలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేపట్టి మురుగు రహిత కార్పొరేషన్‌గా మార్చడానికి చర్యలు తీసుకుంటామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బాలాపూర్ 17వ డివిజన్‌లోని పాత గ్రామంలో కొత్తగా నిర్మించనున్న యూజీడీ పనులకు శనివారం కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతీరెడ్డి, కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, నాయకులు జంగయ్య, శ్రీశైలం, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ 3వ డివిజన్‌లోని రామిడి భూమిరెడ్డినగర్ కాలనీలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ రామిడి మాధురీవీరకర్ణారెడ్డితో కలిసి మేయర్ పారిజాతారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతీరెడ్డి, నాయకులు రామిడి శూరకర్ణారెడ్డి, చప్పిడి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

వరదనీటి పైప్‌లైన్ పనుల పరిశీలన

వనస్థలిపురం: కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ అనురాధకాలనీ నుంచి మల్లికార్జున నగర్ ప్రధాన రహదారి వరకు చేపట్టబోయే వరదనీటి పైప్‌లైన్ పనులను కాలనీవాసులతో కలిసి శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈఈ కార్తీక్, డీఈ రఫీ, ఏఈ ప్రజ్ఞ, పలు కాలనీల అధ్యక్షులు వెంకటేష్, అజయ్, కృష్ణ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

చార్మినార్ ప్రాజెక్టు సీపీడీఓగా పావని

సైదాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చార్మినార్ ప్రాజెక్టు శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి(సీపీడీఓ)గా పావని శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన జ్యోత్స్న బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పావనీ సాయినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం చిన్నారులతో ఆమె ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టీచర్ పద్మిని, హెల్పర్ సక్కు పాల్గొన్నారు.

వసతిగృహ సమస్యలను పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని పీ అండ్ టీ కాలనీలో ఉన్న వెనకబడిన తరగతుల కళాశాల బాలుర ప్రభుత్వ వసతి గృహంలో నాణ్యమైన భోజనం అందించడం లేదంటూ విద్యార్థులు శనివారం హాస్టల్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వారికి మద్దతుగా ఏబీవీపీ నాయకుడు మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కూడా రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు.

సైబరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 309 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 261 మంది ద్విచక్రవాహనదారులు, 11మంది ఆటోడ్రైవర్లు, 36 మంది కార్లు నడిపేవారు. ఒక భారీ వాహన డ్రైవర్ ఉన్నారు. మాదాపూర్‌లో 17 మంది, రాయదుర్గంలో 13 మంది, గచ్చిబౌలిలో ఆరుగురు, నార్సింగ్‌లో 13 మంది, రాజేంద్రగర్‌లో 35మంది, శంషాబాద్‌లో 20 మంది, చేవెళ్లలో 18మంది, షాద్‌నగర్‌లో 10 మంది, మియాపూర్‌లో 52 మంది, కూకట్‌పల్లిలో 13మంది, బాలానగర్‌లో 21 మంది, జీడిమెట్లలో 16 మంది, అల్వాల్‌లో 22 మంది, కేపీహెచ్‌బీలో 8 మంది, మేడ్చల్‌లో 17మంది, ఆర్‌సీపురంలో 28మంది డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు



హైదర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కారును వెనక్కి తిప్పుతుండగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ నుంచి ప్రగతినగర్ వైపుగా వెళ్తున్న కారు చెరువు ప్రారంభంలో టర్న్ చేసుకునే క్రమంలో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను కాపాడారు. స్థానికుల సహాయంతో యజమాని కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కారులోకి పూర్తిగా నీరు వెళ్లడంతో కారు పాడయింది.

రేపటి నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేస్తాం : మేయర్ పారిజాతారెడ్డి


మాట్లాడుతున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ జీ.రఘుతో కలిసి సిబ్బంది, కార్పొరేటర్లతో ఏర్పాటు


ఏర్పాట్ల వివరాలను వెల్లడిస్తున్న యూబీడీ అడిషనల్ కమిషనర్ సునంద

చేసిన సమీక్షా సమావేశంలో పారిజాతారెడ్డి మాట్లాడుతూ ప్రజలను సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, వారికి సరైన అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తాగునీటి స్వచ్ఛత, వర్షపు నీటి సంరక్షణ(ఇంకుడు గుంతల నిర్మాణం), మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, గుంతలు పూడ్చటం, వీధి కుక్కలు, పందుల బెడదకు తీసుకోవాల్సిన చర్యలు, ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేయడం వంటి పలు అంశాలు 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా చేపట్టనున్నట్లు ఆమె వివరించారు. పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమం విజయవంతానికి తమ వంతు కృషి చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మలక్‌పేటలో హరితహారం..

చాదర్‌ఘాట్ : స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని డివిజన్ల వారీగా సోమవారం నుంచి హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యూబీడీ అడిషనల్ కమిషనర్ సునంద తెలిపారు. సోమవారం నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరగనున్న హరితహారం కార్యక్రమంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసేందుకు అవసరమైన 20వేల మొక్కలను సిద్ధం చేసినట్లు ఆమె వివరించారు. జామ, తులసి, సబ్జ, మామిడితోపాటు పలు రకాల మొక్కలు ప్రతి ఇంట్లో నాటేందుకు వీలుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాలు, వాకర్స్ అసోసియేషన్స్, మహిళా సంఘాలు, వ్యాపార, వర్తక, వాణిజ్య సంఘాలు, కుల సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మలక్‌పేట సర్కి ల్-6 పరిధిలోని ఆరు డివిజన్‌లైన ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట, చావునీ, సైదాబాద్, మూసారాంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించేందుకు రెండేసీ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మలక్‌పేటలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.

శానిటేషన్ సిబ్బందికి అవగాహన

స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 కార్యక్రమంలో నిర్వహించనున్నట్లు సానిటేషన్ సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మలక్‌పేటలో శానిటేషన్ ఎస్‌ఎఫ్‌ఏలు, స్వీపింగ్ సిబ్బందితో సమావేశమై స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, కాలనీ, బస్తీల రోడ్లు పరిశుభ్రంగా ఉంచడం, మట్టి, చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు వీలుగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఏలు, స్వీపింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త తొలగేలా చర్యలు తీసుకోవడంలో అధికారులకు సహకరించాలన్నారు.

ప్రధాని మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం

హయత్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ ఎస్సీ మోర్చా మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పారంద సాయి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్రమోదీ, మంద కృష్ణమాదిగ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా ఎల్బీనగర్ కన్వీనర్ కిరణ్‌కుమార్, జగన్, శ్రీను, క్యాదాస్ చిరు, యాదయ్య, రామేశ్వర్, హరీష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, కవితరెడ్డి, రోహిత్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రవితేజ, దశరథ పాల్గొన్నారు.


హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మోదీ, మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్సీ మోర్చా నేతలు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో మంద కృష్ణమాదిగ చిత్ర పటానికి నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి పెట్టి, బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎర్ర రవీందర్‌మాదిగ, స్వామిమాదిగ, మహేందర్, సతీష్, కృష్ణ కుమార్, సురేష్, చిరంజీవి, శక్తి పాల్గొన్నారు.


మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు

వనస్థలిపురం : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదించడం హర్షణీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద డివిజన్ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షులు పారంద సాయి, నాయకులు కిరణ్‌కుమార్, యంజాల్ జగన్, శ్రీను, క్యాదాస్ చిరు, యాదయ్య పాల్గొన్నారు.

చంచల్‌గూడ జైలు అదాలత్‌లో 40 కేసుల పరిష్కారం


జైలు అదాలత్‌లో జడ్జీలు, అధికారులు

సైదాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో శనివారం నిర్వహించిన జైల్‌అదాలత్‌లో 40 కేసులు పరిష్కరించగా 32 మంది ఖైదీలకు విముక్తి లభించింది. జడ్జీలు ఆజేష్‌కుమార్, రాజేందర్, కుమారస్వామి, రాజు, సంతోష్‌కుమార్‌లు కేసులను విచారించారు. సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్, డిప్యూటీ సూపరింటెండెంట్లు నిరంజన్‌రెడ్డి, దేవ్లా, జైలర్లు దేవ్‌సింగ్, అచ్చయ్య, జలంధర్, తిరుమల్‌రెడ్డి, మధు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తా : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పోలీస్‌కాలనీ, సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీల్లో కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు అజయ్‌కుమార్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూ నాగోల్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): న్యూనాగోల్‌కాలనీ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను సంప్రదిస్తూ, కృషి చేస్తానని న్యూనాగోల్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు పోచంపల్లి రాజేందర్‌రెడ్డి(పీఎంఆర్ రాజు) తెలిపారు. కొత్తపేట డివిజన్ న్యూనాగోల్‌కాలనీ నూతన కార్యవర్గం శనివారం ఏర్పాటయింది. సంఘం ప్రధాన కార్యదర్శిగా జీ.మోహన్‌రాజు, కోశాధికారిగా ఏ.తిమ్మారెడ్డి, సహాయ కార్యదర్శిగా ఏ.మల్లారెడ్డి, నిర్వాహక కార్యదర్శులుగా పీవీ. శైలేందర్, ఎం. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా సీహెచ్ కృష్ణవేణి, కాట శ్రీశైలంగౌడ్, సత్యనారాయణరెడ్డి, కల్చరల్ సెక్రెటరీగా శశిధర్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా అనంతుల రాజారెడ్డి, సలహాదారుగా సుమతీరెడ్డి వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

డ్రగ్స్ అమ్మినా, కొన్నా కఠిన చర్యలు : ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

సైదాబాద్ : నిషేధిత మత్తు పదార్థాలు, డ్రగ్స్ అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్‌నాయక్ హెచ్చరించారు. శనివారం మలక్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలు డ్రగ్స్, గంజాయి, ఎండీఎంఏ, హెరాయిన్, ఎల్‌ఎస్‌డీ, కొకైన్, బ్రౌన్ షుగర్, ఎన్‌డీపీఎల్ లిక్కర్, నాటుసారా అమ్మినా, వాడినా రెండు నేరమేనని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఒక సారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే ఇక వారి జీవితం అంధకారమవుతుందన్నారు.

'రోడ్ల పక్కన చెత్త వేస్తే జరిమానా, కేసు'

సరూర్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన, వీధుల్లో, ప్రధాన కూడళ్లలో చెత్త పడేస్తే కఠిన చర్యలు తప్పవని బడంగ్‌పేట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వీ.యాదగిరి హెచ్చరించారు. నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని ఓ రోడ్డు పక్కన శనివారం చెత్త పడేస్తున్న వ్యక్తిని శానిటేషన్ సిబ్బంది పట్టుకోగా, అతడికి మొదటి తప్పుగా పరిగణించి రూ.500 జరిమానా విధించారు. మరోసారి చెత్త వేస్తే రూ.2వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా యాదగిరి పేర్కొన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేసే వారికి జరిమానా విధించడంతో పాటు పోలీసు కేసు సైతం పెట్టనున్నట్టు ఆయన స్పష్టం చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట్‌కు నూతన సబ్ రిజిస్ట్రార్లు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ వహిద్‌ఖాన్, పెద్దఅంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ సంతోష్‌కుమార్ బదిలీ అయ్యారు. వారి స్థానంలో అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్‌గా సునీతరాణి, పెద్దఅంబర్‌పేట్ రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు శుక్రవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించారు. వహిద్‌ఖాన్ సదాశివపేటకు, సంతోష్‌కుమార్ మారేడుపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్ రిజిస్ట్రార్ సునీతరాణిని డాక్యుమెంట్ రైటర్లు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలి

హైదరాబాద్ సిటీ : సైన్స్ బోధనలో భారతీయ ప్రమాణాలను మిళితం చేయాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో స్టాండర్డ్స్ క్లబ్స్‌గా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులకు 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే అంశంపై బీఐఎస్ రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇచ్చింది. పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా 10వేలు, తెలంగాణలో 190 పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విదార్థులకు విభిన్న పోటీల్లో భాగస్వామ్యం చేయడం, భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమల సందర్శనకు తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు రాకేష్, కెవిన్, ఏఎన్ఎస్పీ శాస్త్రీలు పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ఎల్బీనగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సరూర్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ మాట్లాడుతూ కేరళలో సంభవించిన వరదల బీభత్సంలో అనేక కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు వచ్చిన విరాళాలను జిల్లా పార్టీకి అందజేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కందుల సుధాకర్, మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిద, మండల ఏఐటీయూసీ కార్యదర్శి మద్దిలేటి, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి కమలమ్మ, సీపీఐ నాయకులు పూజారి శ్రీను, ఇదిరీస్ బాయ్, అనిత, హేమలత పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సీపీఐ కార్యదర్శి నర్సింహ, సుధాకర్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్ : కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయం కోసం సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ శనివారం మండల కేంద్రంలో విరాళాల సేకరణ చేపట్టింది. నాయకులతో పాటు వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ వయనాడ్ బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నర్సింహ, యాదగిరి, సైదులు, నిరంజన్, చందన, మధు, నాయక్, లక్ష్మి, ప్రియ పాల్గొన్నారు.

చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ సుధీర్‌బాబు

దిల్‌సుఖ్‌నగర్ : చైతన్యపురి పోలీస్ స్టేషన్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరుగురించి ఆరా తీశారు. ఎస్ఐల సెక్టార్ల వారు ఏ విధంగా ఫిర్యాదులు పరిష్కరిస్తు, ప్రజలకు అందుబాటులో ఉంటున్నారో అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు.

ఈవో లావణ్యకు సన్మానం

చంపాపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం ఈవోగా నియమితులైన లావణ్యను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మకర్తలు అంజిరెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్, కళ్యాణ్, గూడురు మధుసూదన్‌రెడ్డి, చీర తిరుమలేష్, యాదగిరి, మేక సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హయత్‌నగర్ ఎంఈవోగా శ్రీనివాస్

హయత్‌నగర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ నూతన ఎంఈవోగా శ్రీనివాస్ నియమితులయ్యారు. మొన్నటి వరకు ఇక్కడ పనిచేసిన హీర్యానాయక్ ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట్ ఎంఈవో శ్రీనివాస్‌ను హయత్‌నగర్ ఎంఈవోగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు.

రేపు అథ్లెటిక్స్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల ఐదో తేదీన హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ ట్రయల్స్‌ను ఆ క్రీడా సంఘం నిర్వహించనుంది. సోమవారం ఉదయం 6.30 గంటల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ట్రయల్స్‌ను నిర్వహించనున్నారు. అండర్-12 బాలబాలికలకు 400 మీటర్ల విభాగంలో, అండర్-14, 16, 18, 20 బాలబాలికలకు, యువతకు 100 మీ., 400 మీ., పరుగు, జావెలిన్ త్రోలో ట్రయల్స్ ఏర్పాటు చేయనున్నారు. మరిన్ని వివరాల కోసం ఈ నెంబర్‌కు 9849048586 ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

చైతన్యపురిలో యువతి ఆత్మహత్య

చైతన్యపురి : చైతన్యపురి పరిధిలోని మారుతి హోమ్స్‌లో నివాసం ఉంటున్న రవీందర్ అనే ఆర్టీసీ ఉద్యోగి కుమార్తె చందన(18) ఇంట్లోని ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించిన యువతి వరంగల్ ఎన్ఐటీలో సీటు పొందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట : పిల్లలకూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ సూచించారు. శనివారం బోడుప్పల్ జీనస్ స్కూల్ నుండి 97మంది చిన్నారులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ చిల్డ్రన్స్ పార్కును సందర్శించారు. హీరోమోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, టీటీఐ సిబ్బంది రమేష్, పార్కు ప్రహరీపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల పోస్టర్లు, రోడ్ సైన్స్ చూపుతూ టీటీఐ నిబంధనలను పరిచయం చేశారు. అనంతరం లెక్చర్ హాల్‌లో టీటీఐ ఇన్‌స్పెక్టర్ హెల్మెట్ ప్రాధాన్యతపై మాట్లాడారు. నిబంధనలపై అవగాహన కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వీడియోలను ప్రదర్శించారు. సైకిళ్లు నడిపే వేళా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్, మనోహర్, హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

లింక్ ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ

- ఎస్‌బీఐ ఖాతాదారులకు రివార్డు పాయింట్స్ పేరుతో నకిలీ మెసేజ్‌లు
- సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరో కొత్తరకం మోసానికి తెరతీశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారులను లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ పేరుతో ఒక నకిలీ మెసేజ్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. "ప్రియమైన వినియోగదారులారా..! మీ ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు (9980.00) గడువు నేటితో ముగుస్తుంది. వెంటనే ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది." అంటూ నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వచ్చిన మెసేజ్ నిజమని నమ్మి లింక్‌ను ఓపెన్ చేసి ఎస్‌బీఐ రివార్డు యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వెంటనే 'మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు. దాంతో మీ ఫోన్ కంట్రోలింగ్ వారి చేతికి వెళ్తుంది. ఫోన్‌లో మీరు ఎస్‌బీఐ ఖాతా వివరాలు నమోదు చేయగానే వారు ఖాతాలో ఉన్న డబ్బు ఖాళీ చేస్తారు' అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారులు ఈ మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మొద్దని, ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఫోన్‌లో ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

కొత్తపేట: ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో భార్యతో గొడవ పడిన భర్త బైకుపై ఎటో వెళ్లిపోయి తిరిగి రాక అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్ గుంటి జంగయ్యకాలనీలో ఉండే మహబూబ్‌నగర్ పెన్మిల్ల వాసి చింతపల్లి మల్లయ్య(32) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత నెల 17న అతడు భార్య కృష్ణవేణితో డబ్బుల విషయంపై గొడవపడ్డాడు. అదే రోజు సాయంత్రం 6గంటలకు అతడు ఇంటి నుండి తన బైకుపై బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కృష్ణవేణి అతడి సెల్ నెంబర్‌కు కాల్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉన్నట్లు గుర్తించింది. బంధువులను సంప్రదిస్తూ ఆమె అతడి ఆచూకీ కోసం అంతటా వెతికినా ఫలితం దక్కలేదు. శనివారం సాయంత్రం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భరత్‌నగర్ -2లో వ్యక్తిపై హత్యాయత్నం

కొత్తపేట : ఎల్బీనగర్ పీఎస్ పరిధి భరత్‌నగర్ -2లో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి మామపై ఆమె సోదరుడు కత్తితో దాడి చేసి గాయపరచిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కామినేని సమీపంలోని భరత్‌నగర్ -2లో ఉంటున్న ఆకారపు కళ గృహిణి. అదే బస్తీలో ఉండే హనుమంతు శుక్రవారం రాత్రి కళ ఇంటికి వచ్చి ఆమె చేతులు పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. అదే సమయంలో హనుమంతు మామ రమావత్ శంకర్‌నాయక్ అక్కడికి వచ్చాడు. కళకూ వారిద్దరికీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇంట్లో ఉన్న కళ సోదరుడు దేవరాజు(26) వంటగదిలో ఉన్న కూరగాయల కత్తి తీసుకుని శంకర్‌నాయక్‌పై దాడి చేశాడు. దీంతో శంకర్‌నాయక్ మెడపై గాయమైంది. చికిత్స నిమిత్తం అతడిని తొలుత సంజీవని ఆస్పత్రికి, తర్వాత గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు గాయపడిన శంకర్‌నాయక్ వాగ్మూలాన్నీ నమోదు చేసుకున్నారు. శనివారం బాధితురాలు కళ, శంకర్‌నాయక్ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.